# రొంపా? రొమాన్సా?!

సోమవారం పొద్దుట ఎనిమిదిన్నర దాటిపోయింది— కృష్ణమూర్తి పడక గదిలోంచి వంటింటికేసి వచ్చేసరికి. బాత్ రూమ్‌లో జోళ్ళూ, లుంగీ, మీద బనీనూ ఏగానే సరికే గ్రహించింది పార్వతి ఏదో వుందని. ఆబనీను ధారణ తన భర్త గారికి ఒంట్లో బాగాలేనప్పుడే దర్శనం ఇస్తూ వుంటుంది!

వ్యాపారం ఎంతో నేర్పుగా, యింటిని ఎంతో వెచ్చగా నడిపించే కృష్ణమూర్తి- చిన్నమెత్తు అనారోగ్యం అమడ దూరంలో ఉందనగానే జావగారిపోతాడు అదేమిటో.

“అంత ప్రమాదం ఏం ఉంటుంది? నిన్న రాత్రి బాగానే ఉన్నారే” అనుకుంటూ వంటింటి పనిలో సతమత మవ సాగింది పార్వతి.

“టైమైపోతుంది. గబగబా తెములకపోతే పిల్లలని దింపి వేళ్ళే టైముండదు” అంది.

“నేనీరోజు ఆఫీసుకు వెళ్ళడంలేదు పార్వతీ” అన్నాడు కృష్ణమూర్తి. ఆ కంఠస్వరం నూతిలోంచి వస్తూంది. ముఖం కేసి చూస్తే జాలిపడక తప్పదు అనుకుంది పార్వతి.

"నాకు రొంపగా ఉంది." అంటూ నిష్కర్షగా అన్నట్టు ఒక ఒకతుమ్ము తుమ్మాడు కృష్ణమూర్తి. (దగ్గుగా ఉంది డాక్టరుగారూ అంటూ పేషెంటు దగ్గి చూపెట్టినట్టు.)

"అంతేకదా" అంటూ తేలికగా నవ్వేసింది పార్వతి.

"అంతే కదా అంటే నీ ఉద్దేశ్యం? అది చాల దానా?!...నాకెంత బాధగావుందో నీకేం తెలుసూ?"

కాఫీ కప్పు చేత్తో పట్టుకుని అతనికేసి నడిచింది పార్వతి. టేబిలు మీద కప్పు పెట్టి మమకారంగా వంగి పెదవులతో అతని నుదురు తాకిచూసింది.

"థాంక్స్ కాని ఆ ముద్దువల్ల నా రొంప పోతుందా ఏం!" మూతి ముడుచుకున్నాడు కృష్ణమూర్తి.

"నేనేం ముద్దు పెట్టుకోలేదు జ్వరం ఉందేమో అని చూశాను." అంది పార్వతి.

"ఈ రొంపలో పనిచేసే ధర్మామీట రొకట్టికూడా ఉండదు!" అన్నాడు కాఫీ కప్పు అందుకుంటూ." గదిలో ఉన్న ధర్మామీటరులో మెర్క్యూరీ పైకెక్కడమే లేదు" అన్నాడు. 'నీ టెంపరేచర్ నార్మల్ గా ఉందేమో. అంచేత అలా ఉంది...ఏం టిఫినుతింటావు?' స్టవు చుట్టూ చేరిన పాత్రలు సర్దుతూ అడిగింది పార్వతి.

"రొంపకి లంఖణమే మందు" అన్నాడు కృష్ణమూర్తి.

"నీకు తల్లి క్రిందులుగా జ్ఞాపకం వున్నట్టుంది! "నవ్వకుండా ఉండడానికి ప్రయత్నిస్తూ అంది పార్వతి. "జ్వరానికి లంఖణం మందు" అంది.

"నీకేం వేళాకోళంగానే వుంటుంది. నా తల బద్దలయిపోతోంది. ముక్కు ఊపిరాడ్డంలేదు. ఈ రోజంతా పడుకోవడమే మంచిదేమో అని పిస్తోంది" అన్నాడు కృష్ణమూర్తి.

"మీరు ఆడవాళ్ళని అబలలంటూ చిన్న చూపు చూస్తారు" అనుకుంది పార్వతి. నాకు రొంప పడితే అసలు పట్టించుకోను. దానిసంగతే మరిచిపోయి చేయవలసిన పనులు చేసుకొంటూ పోతాను, ఇలాంటివాటి నంతా పట్టించుకోడానికి ఆడవాళ్ళకి టైమెక్కడుంటుంది. మగ వాళ్ళకున్నట్టు!

"కాఫీ చల్లారిపోయింది తాగేయి. వేడిగా ఆమ్లెట్ వేస్తాను. తింటావా?" అడిగింది.

"నాకేం తినాలనిలేదు, అయినా పోనీ ఎక్కువగా ఉల్లిపాయలువేసి వేస్తావేమిటి:" అన్నాడు కృష్ణమూర్తి కాఫీ కప్పు పైకెత్తుతూ.

"పార్వతి అలాగే అఫీసుకి ఫోను చేసి నే రావడం లేదని చెప్పు. అర్జెంటు వేమేనా వుంటే ఇంటికి ఫోను చెయ్యమను...నువ్వు కనుక్కొంటూగా ఉండొచ్చు. ఏం" అన్నాడు కుర్చీలో జేరబడుతూ.

ఇవి చాలు, మంచంపక్క ఫోను పెట్టుకుని యీ మహాత్ముడు దాన్ని ఎత్తలేని స్థితిలో ఉంటాడన్నమాట! పళ్ళు గిట్ట కరుచుకుని గుడ్లు కొట్టి గిన్నెలో పోసింది పార్వతి.

"ఫోను ఎక్స్టెన్షన్ పెట్టేస్తాను, పడుకునే మాట్లాడు దువుగాని,..నాకు కుదరదేమో". అంది నెమ్మదిగా.

"ఏం కుదరదు?" జేరబడినవాడు ముందుకి వంగాడు కృష్ణమూర్తి.

"నేను పదిగంటలకి బయటికి వెడుతున్నాను. ఉష ఊళ్ళోకి వచ్చింది నీకు తెలుసా?" ఎంతో నెమ్మదిగా అంది పార్వతి.

"నన్నిలా ఉన్నప్పుడు ఒంటరిగా వదిలేసి వెళ్ళిపోతావా? నాకంటే నీ స్నేహితురాలే ముఖ్యమా నీకు? ప్రతిరోజూ యింట్లోనే ఉంటావుగా ఈ రోజే వెళ్ళాలా ఏం?"

"ఈ రోజు తప్పదు...ఇద్దరం తప్పకుండా కలిసి బజారుకి వెడదాం అనుకున్నాం. మళ్ళీ వెళ్ళిపోతుంది తను." పెనం స్టౌవు మీద సర్దుతూ అంది పార్వతి.

"ఔనవును. ముందుగా నీతో నేను ఎపాయింట్మెంటొకటి చేసుకోవలసింది. నాదే తప్పు, చెప్పా పెట్టకుండా యిలా జబ్బుపడ్డం" కుర్చీలోంచి అమాంతం లేచినిలబడ్డాడు కృష్ణమూర్తి. దాంతో సరి?— అనుకుంటూ అమ్లెట్ అట్లకాడతో సర్దింది పార్వతి...జాగ్రత్తగా దాన్ని ప్లేటులోకి తరలించి గబాలున పక్కకి తిరిగింది.

"అదేనువ్విక్కడే వున్నావురా...తొక్కేశానా?..." అంటూ జాలిపడింది. పెంపుడు పిల్లి కాలికి తగిలితేను.

"ఓ క్షణం పాటు నన్నేమో ననుకున్నాను పార్వతీ? నాతోనే అలా జాలిగా ముద్దుగా మాట్లాడుతున్నా వనుకున్నాను." నెమ్మదిగా అన్నాడు కృష్ణమూర్తి.

"సరిగ్గా నా కాలికింద వుంది. పాపం ఆకలిగా ఉందేమో వెధవకి!" అంది ముద్దుగా.

నా ఆమ్లెట్ పాపం దానికి పెట్టు! అంటూ" రెండు అంగల్లో వంటిల్లుదాటి వెళ్ళిపోయాడు కృష్ణమూర్తి.

"ఎంత అన్యాయం! ఒక్క తుమ్ముతో ప్రపంచం విరిగి మీదపడినట్టు!... ఈసారేమైనా నేను ఊరుకోను. ఉపని చూడ్డానికి వెళ్ళడం మానేసి తన దగ్గరే కూర్చోమని కాబోలు!" అని కోపంగా ఆ అమ్లెట్ ప్లేటు పిల్లిముందు పెట్టింది పార్వతి. తినమంటూ... తినవోయ్ అలా దివాలా కళ్ళేసుకు చూస్తావెందుకూ.! తిను." అంది పిల్లిని. ఆ పిల్లి కెన్నో పేర్లున్నాయి. దానిమూడ్స్ ఇట్టే గ్రహిస్తుంది. ఏమిటి అలా జగ్గయ్యలా కంచు కంఠంతో అరుస్తున్నావు? అంటుంది. ఏం సూర్యకాంతంలా గుర్ మంటున్నావు అంటూ మనిషితో మాట్లాడినట్టే మాట్లాడుతూ వుంటుంది. ఈ రోజేం దుకిలా దివాలా తీసిన గుమ్మడిలాగా జాలిగా చూస్తుంది. అనుకుంది. "తినవోయ్ పెద్ద" అంటూ కసురుకుంది. పిల్లి కాళ్ళకి చుట్టు కుందేగాని ప్లేటులో ఆమ్లెట్ ముట్టుకోలేదు.

"వెర్రి వేషాలెయ్యకు హీరోలాగా. చేతితో ముక్కలు అందిస్తానని చూస్తున్నావు కాబోలు. నిజంగా ఆకలివేస్తే నువ్వే తింటావు. దొంగపిల్లిలా...అందరూ నామీద ఆధార పడేవాళ్ళే...దురలవాటు...ఈ దురలవాట్లు నడుం విర క్కొడితే గాని లాభంలేదు" అంటూ పిల్లికేసి కోపంగా చూసి కృష్ణమూర్తి గదికేసి నడిచింది పార్వతి. పీకదాకా దుప్పటి కప్పుకుని పడుకున్నాడు కృష్ణమూర్తి. కళ్లు మూసు కుని ఉన్నాయి.

"నే వెళ్ళినా త్వరగా వచ్చేస్తాలే" అంటూ బీరువా తెరిచి ది ఏ చీర కట్టుకోవాలా అని.

"తొందరేం లేదు. హడావిడి వచ్చేయ్యాకూ, కళ్ళు మూసుకునే నాకేం అయిపోదులే ఇంతలో" నీకు వేడిగా కాఫీ ఫ్లాస్కులో పోస్తాను. కావలిస్తే తాగుదువుగాని.

స్టవ్ మీద నీళ్ళు పెట్టిన సంగతి జ్ఞాపకం వచ్చి గబగబ వంటింట్లోకి వచ్చింది పార్వతి. ప్లేటుపక్కన జపంచేస్తూ పడుకుంది పిల్లి. ముందు కాళ్ళమీద తల ఆన్చుకుని విషాదంగా పడుకుని ఉంది. పార్వతి రావడం చూసి కళ్ళు తెరిచి లేచి నిలబడింది. మళ్ళీ పార్వతి కాళ్ళకి రాసుకోవడం ప్రారంభించింది. బొత్తిగా "శరత్ శ్రీ" లాగా ఉన్నావేమిటి అనుకుంది పార్వతి. పిచ్చి ! నే పెట్టలేదని నిరశన వ్రతమా? అనుకుంది. అలా జాలిగాచూసే నన్ను బొమ్మని చేసి ఆడిస్తున్నావు అనుకుంది. చిన్న ఆమ్లెట్ ముక్క గిల్లి పిల్లి నోటికి అందించింది. ఆత్రంగా అందుకుని పార్వతి వేళ్ళని అకురాయి లాంటి నాలికతో క్లీన్ గా నాకేసింది పిల్లిగాడు. వెధవ పొగరు కాకపోతే అనుకుంటూ దానివీపు రాసింది పార్వతి. చెన్నత్తి తోకని జయస్తంభంలాగ నిలబెట్టి గుర్రుమంటూ తృప్తి ప్రదర్శించింది పిల్లి. పిచ్చినాన్న అనుకుంది పార్వతి... అప్పుడే ఏదో మెదడులో తలుపు తెరచుకొన్నట్టయింది పార్వతికి...నవ్వుకుంటూ హాల్లోకి నడిచి ఉమ నెంబరుకి ఫోను చేసింది.

"క్షమించవోయ్ ఈ పూట రాలేను." అంది. అదేం మొన్ననగా అనుకున్నాంగా అంది ఉమ. "అదికాదు ఉమా. కృష్ణమూర్తికి కొంచెం రొంపగా ఉన్నట్టుది...అబ్బే జ్వరం లేదు. అయినా నీకు తెలుసుగా ఈ మగవాళ్ళ సంగతి అంటూ నవ్వుతూ ఫోను పెట్టేసింది పార్వతి.

మళ్ళీ పిల్లి దగ్గర కూర్చుంటూ "ఏం మగవాళ్లు" అనుకుంది పార్వతి. కృష్ణమూర్తికి తెలుసు - ఏమిటి ఆడవాళ్ళని — అనుకుంది...ఈ పదేళ్ళ వైవాహిత జీవితంలో ఇద్దరం నేర్చుకున్న పాఠాలు చాలానే వున్నాయి. కొన్ని సార్లు నేనతనిమీద ఆధారపడతాను. కొన్ని సమయాల్లో అతను నామీద ఆధారపడి పోతాడు...పోవాలని అనిపిస్తుంది కాబోలు అనుకుంది. పిల్లి ఆమ్లెట్ పూర్తిగా తినెయ్యడమే కాదు. పార్వతి ఒడిలో వెచ్చగా ముడుకుందుకు సర్దుకుంటూంది,..నావేళ్ళలో ఏముంది? అనుకుంది. ఏ స్త్రీ వేళ్ళలో మటుకు ఏముంది, పిల్లిని పిల్లాడిని తినేలా చేసే ఈ వేళ్ళల్లో ఏముందో ? అనుకుంది ... పోయివేటాడు. మొద్దులా నిద్దరోక అంటూ పిల్లిని ఒళ్ళోంచి దింపింది. అది ఒక్క పరుగున తోటలోకి దౌడు తీసింది. పార్వతి కృష్ణమూర్తి గదిలోకి వెళ్ళి మంచం అంచున కూర్చుంది. "నేను నిన్ను ఒంటరిగా వదలి వెళ్ళలేను. రానని చెప్పాను ఉమకి. అంది." అతని నుదుటిపై చేయివేసి చెదరిన జుట్టు పైకి తోస్తూ. ఆ చేతిని అలాగే పట్టుకున్నాడు కృష్ణమూర్తి. పార్వతి నవ్వుకుంది. కళ్ళు తెరచి నవ్వుతూ నా కివ్వాడే కొంచెం తేలికగా వుంది పార్వతీ. ఈరోజు రెస్టు తీసుకుంటే రేపు ఆఫీసుకు వెళ్ళిపోగలను కదూ?" అన్నాడు పార్వతి వేళ్ళు పదేపదే లెక్కపెడుతూ.

అలాగే అంటూ అతని తలగడ సరిచేసింది పార్వతి. లేచి కిటికీలోంచి బయటికి చూసింది. పిల్లి చెట్టెక్కుతున్న తొండకేసి పొంచి చూస్తూంది. వట్టే

దామని ... ప్రాంతీయాధికారం ప్రదర్శిస్తోంది- ఒంట్లోనూ మనస్సులోనూ బాగున్నట్టే కాబోలు అనుకుంది పార్వతి. తప్పకుండా రేపటికి తేలికవుతుంది ఈ పూటకి పడుకో" అంటూ ప్రక్కన కూర్చుంది పార్వతి.

"పోయి స్నానంచేసి నే కొన్న డై అండ్ డై చీర కట్టుకోవా పార్వతీ?" ప్రేమగా పార్వతికి దగ్గరికి తీసుకుంటూ రొంపకి మందు కోరుతున్నట్టు అడిగాడు కృష్ణమూర్తి.

"రొంప అంటూవ్యాధి కృష్ణా" నవ్వుతూ లేచింది పార్వతి.